క్లుప్తంగా

రాజరాజేశ్వరీదేవికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న అమ్మవారు

బొండపల్లి: దేవుపల్లి గ్రామంలోని రాజరాజేశ్వరీదేవి ఆలయంలో అర్చకులు దూసి శ్రీధర్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు ప్రభలు,మేళతాళాలతో ఆలయానికి తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

చుక్కమాంబ తీర్థం ప్రారంభం



పూజలందుకుంటున్న అమ్మవారు

వేపాడ: అరిగిపాలెం గ్రామంలో మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహించనున్న చుక్కమాంబ అమ్మవారి తీర్థమహోత్సవం ఆదివారం ప్రారంభమైంది. తొలి రోజు అమ్మవారికి భక్తులు పసుపు, కుంకుమ సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.సోమ, మంగళ వారాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు సాయంత్రం పూట రేలారేరేల, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటం ప్రదర్శనలు ఏర్పాటు చేశామని కమిటీ సభ్యులు తెలిపారు.


ఇంటింటికీ భగవద్గీత



భగవద్గీత పుస్తకాలు పంపిణీ చేస్తున్న కోటేశ్వరరావు, తదితరులు

శృంగవరపుకోట: ఇంటింటికీ భగవద్గీత పుస్తకాలు చేర్చాలన్నదే తమ లక్ష్యమని స్థానిక మోక్షవిద్య యోగమందిర్ సంస్థ నిర్వాహకులు శీలా కోటేశ్వరరావు అన్నారు. ఆదివారం సాయంత్రం సంస్థ కార్యకర్తలతో కలిసి పట్టణంలోని గాంధీనగర్‌లో 1,2,3 వీధుల్లో గృహస్తులకు భగవద్గీత పుస్తకాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవద్గీత పఠనం ప్రతీ భారతీయుని కర్తవ్యం అన్నారు.దాతల సహాయ, సహకారాలతో ఇంటింటికీ పుస్తకాలు పంపిణీ చేస్తున్నామని, పుస్తకాలు కావాల్సిన వారు 99893 68781 లేదా 98667 57311నంబర్లను సంప్ర దించాలని సూచించారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

గుర్ల: మండలంలోని పాలవలసలో లోఓల్టేజీ సమస్యను పరిష్కరించేందుకు అదనపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని ఎంపీపీ పొట్నూరు ప్రమీల విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. దీంతో అధికారులు గ్రామంలో ఆదివారం అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ఈ పనులను వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పొట్నూరు సన్యాసినాయుడు పరిశీలించారు.

గ్రామాభివృద్ధిలో యువతదే కీలక పాత్ర



మొక్కలు నాటుతున్న ఎస్‌ఐ జయంతి

దత్తిరాజేరు: గ్రామాల అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలని పెదమానాపురం ఎస్‌ఐ జయంతి అన్నారు. ఇంగిలాపల్లి గ్రామంలో వివేకానంద యూత్ అసోసియేషన్ సభ్యులు సమకూర్చిన మొక్కలను గ్రామస్తులతో కలిసి ఆదివారం ఆమె నాటారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో యువత ఐకమత్యంగా ఉండాలన్నారు. ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలన్నారు. ఇళ్ల వద్ద ఖాళీ ప్రదేశంలో, పొలంగట్లు పైన మొక్కలు నాటాలని సూచించారు. ఆ గ్రామ నీటి సంఘం అధ్యక్షుడు సన్యాసిరావు, యువత పాల్గొన్నారు.

పేరుగొప్ప.. ఊరు దిబ్బ

- ఎస్.కోట మేజర్ పంచాయతీలో కానరాని అభివృద్ధి
- ప్రయోజనం లేని పంచాయతీ తీర్మానాలు
- పాలకవర్గ సభ్యుల్లో సమన్వయలోపం
- తరచూ వాయిదాపడుతున్న సర్వసభ్య సమావేశాలు
- నేడు మళ్లీ సర్వసభ్య సమావేశం

ఎస్.కోట మేజర్ పంచాయతీలో	
వార్డులు:	20
జనాభా:	28,302
వార్షిక ఆదాయం రూ.	1.30 కోట్లు



ఎస్.కోట పట్టణం



ఎస్.కోటలో శిథిలావస్థకు చేరిన పంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్

శృంగవరపుకోట: జిల్లాలోని మేజర్ పంచాయతీల్లో జనాభాలో ఒకటో స్థానంలో, ఆదాయంలో రెండో స్థానంలో ఉన్న ఎస్.కోట అభివృద్ధిలో మాత్రం అధమ స్థానంలో ఉం ది. 'కోట'కు ఈ గతి పట్టడానికి పాలకుల నిర్లక్ష్యం, అధికారుల వైఫల్యమే కారణమని పంచాయతీ వాసులు చర్చించుకుంటున్నారు. పంచాయతీలో ఎస్.కోట పట్టణంతో పాటు సీతంపేట, పుణ్యగిరి, రేగపుణ్యగిరి గ్రామాలు ఉన్నాయి. ఏళ్లు గడుస్తున్నా, పాలకులు మారుతున్నా పంచాయతీ పరిధిలోని పట్టణంతో పాటు గ్రామాల్లో మాత్రం అభివృద్ధి పట్టాలు ఎక్కడం లేదు. ప్రధానంగా పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది.అలాగే అడ్డగోలు ఆక్రమణలు, మౌలిక సౌకర్యాల కొరత, అనధికార నిర్మాణాలు, పాలకవర్గ సభ్యుల మధ్య సమన్వయ లోపం వంటి కారణాలతో మేజర్ పంచాయతీ ఎస్.కోట అభివృద్ధిలో మైనర్ పంచాయతీలతో పోటీపడలేకపోతోంది.

ప్రయోజనం లేని తీర్మానాలు

ప్రతీ మూడు నెలలకు ఒకసారి పంచాయతీ సర్వసభ్యసమావేశం నిర్వహించి ప్రజల అవసరాలు, ఆలోచనలు గుర్తించి వాటిని గౌరవించి, పట్టణాన్ని అభివృద్ధి చేసేలా, ప్రజాప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని తీర్మానాలు చేయాల్సి ఉంది. అయితే పాలకవర్గంలో కొందరు అందుకు భిన్నంగా తమ స్వార్థానికి, తమ ప్రయోజనాల కోసం పనులు ప్రతిపాదిస్తున్నారన్న ఆరోపణలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. పాలకవర్గం చేసిన తీర్మానాల్లో కొన్నింటిపై సభ్యులు అభ్యంతరం చెబుతుండడంతో ఆ పనులు సైతం పడకేస్తున్నాయి. చేస్తున్న అరకొర పనులు కంటితుడుపు చర్యలుగా పనికి వస్తున్నాయే తప్ప పట్టణాభివృద్ధికి దోహదం పడడం లేదు.



ఎస్.కోటలో అభివృద్ధికి నోచని కుళ్లు కోనేరు

సభ్యుల మధ్య విభేదాలు

ప్రస్తుతం పంచాయతీ పాలకవర్గంలో మూడు గ్రూపులు ఉన్నాయి. సర్పంచ్ మద్దతుదారులు ఒక వర్గంగా, టీడీపీ మద్దతుతో గెలిచిన వార్డు సభ్యులు ఒక వర్గంగా, వైఎస్సార్‌సీపీ మద్దతుతో గెలిచిన వార్డు సభ్యులు ఒక వర్గంగా ఉన్నారు. దీంతో ఇటీవల రెండు దఫాలు జరిగిన సర్వసభ్య సమావేశాలను కొందరు వార్డు సభ్యులు బహిష్కరించారు. పాలకవర్గ సభ్యుల మధ్య విభేదాలతో పట్టణంలో అభివృద్ధి పడకేసింది. శిథిలావస్థలోని షాపింగ్ కాంప్లెక్స్‌లను పునర్నిర్మాణం చేసి, అద్దెల ఆదాయాన్ని పెంచాలన్న నిర్ణయం గాలికి వదిలేశారు. గాంధీ పార్కును అభివృద్ధి చేస్తామని చెప్పి చెట్లు పీకి అలాగే వదిలేశారు. కుళ్లు కోనేరు, కన్నెంగెడ్డ ప్రక్షాళన ప్రతిపాదనలు పడకేశాయి. పట్టణంలోని ప్రధాన రహదారి అడ్డగోలు నిర్మాణాలకు, ఆక్రమణలకు కేరాఫ్ అయ్యింది.ఆక్రమణలు తొలగించేస్తామని ఆర్భాటం చేసి, తీర్మానాలు చేసిన పాలకవర్గం ఇప్పుడు పూర్తిగా ఆవిషయాన్నే పట్టిం చుకోవడం మానేసింది. కోరం చాలక రెండు దఫాలు వాయిదాపడ్డ పంచాయతీ సర్వసభ్యసమావేశం సోమవారం మరోమారు నిర్వహించేందుకు సమాయత్తం అవుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అభివృద్ధిపై దృష్టి సారించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.



ప్రధాన రహదారిలో అడ్డగోలు నిర్మాణాలు



కాలువల ఆక్రమణల వల్ల ప్రధాన రహదారిలో నిలిచిపోయిన వర్షపు నీరు(ఫైల్)

నేటి నుంచి పశుఆరోగ్య శిబిరాలు

శృంగవరపుకోట: పశుసంవర్థకశాఖ ఆధ్వర్యంలో సోమవారం నుంచి ఈనెల 31 వరకు గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నామని, పాడి రైతులు సద్వినియోగించుకోవాలని పశుసంవర్థకశాఖ సహాయ సంచాలకులు బి.చలపతిరావు ఆదివారం ఓ ప్రకటనలో సూచించారు. పశుఆరోగ్య శిబిరాలకు సంబంధించిన షెడ్యూల్‌ను విడుదల చేశారు.

ఎస్.కోట మండలంలో..

ఎస్.కోట మండలంలోని తిమిడి, ధర్మవరం గ్రామాల్లో 20వ తేదీన, 21న వీరనారాయణం, రేవళ్లపాలెం, 22న ఎస్.కోట, ఆలుగుబిల్లి, 23న పల్లపుదుంగాడ,గోపాలపల్లి, 24న పెదఖండేపల్లి, కృష్ణాపురం, 25న కాపుసోంపురం-2, సంతగవిరమ్మపేట, 26న శివరామరాజుపేట, మామిడిపల్లి, 27న భర్తాపురం,కొట్టాం, 28న చామలాపల్లి, వేములాపల్లి, 29న వెంకటరమణపేట, సీతారాంపురం, 30న లచ్చందొరపాలెం, ఎస్.కోట తలారి, 31న మరుపల్లి, పోతనాపల్లి గ్రామాల్లో పశువైద్యులు అప్పలనాయుడు, హేమ రెండు బృందాలుగా సేవలందిస్తారు.

వేపాడ మండలంలో..

వేపాడ మండలంలోని బొద్దాం, వేపాడ గ్రామాల్లో ఈనెల 20వ తేదీన, 21న ఓబలయ్యపాలెం, బల్లంకి, 22న రామస్వామిపేట, దబ్బిరాజుపేట, 23న పి.కె.ఆర్. పురం,చామలాపల్లి, 24న కె.జి.పూడి, కుమ్మపల్లి, 25న పాటూరు, వల్లంపూడి, 26న శింగరాయి, వీలుపర్తి, 27న జాకేరు, కృష్ణారాయుడుపేట, 28న సోంపురం, బానాది, 29న జగ్గయ్యపేట, నల్లబిల్లి, 30న ఆకులసీతంపేట, ఎస్.కె.ఆర్.పురం, 31న ఆతవ, వావిలపాడు గ్రామాల్లో పశువైద్యులు పి.భానుమతి, ఎం.అనిల్ కుమార్ రెండు బృందాలుగా పశు ఆరోగ్య శిబిరాల్లో సేవలందిస్తారని పశుసంవర్థకశాఖ ఏడీ చలపతిరావు స్పష్టం చేశారు.

దత్తిరాజేరు మండలంలో..

దత్తిరాజేరు: మండలంలో సోమవారం నుంచి ఈనెల 31వ తేదీ వరకు పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నట్లు పెదమానాపురం, దత్తిరాజేరు పశు వైద్యాధి కారులు దినేష్,అవినాష్ ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. సోమవారం ఉదయం పెదకాద, చుక్కపేట గ్రామాల్లో పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి, టీకాలు వేయనున్నామని, పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బొండపల్లి మండలంలో..

బొండపల్లి: మండలంలో సోమవారం నుంచి ఈనెల 31వ తేదీ వరకు పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నట్లు స్థానిక పశువైద్యాధికారి కె.కిరణ్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.20న బిల్లలవలస, చిన్నతారామరాపల్లిలో, 21న కొండకిండాం,బి.రాజేరు, 22న కిండాం అగ్రహారం, కెరటాం, 23న నెలి వాడ, కొత్తపాలెం, 24న గొట్లాం ,యడ్లపాలెం, 25న మద్దూరు,వేంద్రాం, 27న అంబటివలస,మరువాడ, 28న ఒంపల్లి,వెదురువాడ, 29న గిట్టుపల్లి,దేవుపల్లి, 30న రయింద్రాం,ఎం.కొత్తవలస, 31న రోళ్లవాక,బొడసింగిపేట గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు సౌకర్యం కల్పించాలని వినతి



ఎమ్మెల్యే లలితకుమారికి వినతిపత్రం అందజేస్తున్న రైతులు

వేపాడ: మండలంలోని సోంపురం గ్రామంలో తోటకళ్లాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని ఆ గ్రామ రైతులు పలువురు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారిని కోరారు. రైతులు ఎమ్మెల్యేను ఎల్.కోటలోని క్యాంపు ఆఫీస్‌లో ఆదివారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ సోంపురం-వేపాడ ప్రధాన రహదారి నుంచి 1.4 కిలో మీటర్ల దూరంలో ఉన్న తోటకళ్లాలకు రోడ్డు లేకపోవడంతో పొలాల నుంచి పంటను తెచ్చుకునేందుకు ఇబ్బందులు పడుతున్నా మని చెప్పారు. రోడ్డు ఏర్పాటు చేసి తమ ఇబ్బందులు తొలగించాలని కో రారు. ఎమ్మెల్యే ఆర్అండ్‌బీ డీఈతో ఫోన్‌లో మా ట్లాడి ఉపాధినిధులతో రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు చేయాలని సూచించారు. ఆ గ్రామ నీటిసంఘం అధ్యక్షుడు జాగరాపురాము, రైతులు ఎస్.సత్యనారాయణ, మళ్ల రమణ,తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రత మన బాధ్యత



ఆర్టీసీ ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడుతున్న డీఎం రమేష్

శృంగవరపుకోట: రహదారి భద్రత మన బాధ్యతని స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ కె.రమేష్ అన్నారు. ఆర్టీసీలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక ఆర్టీసీ డిపోలో సిబ్బందికి రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్యూటీ లేని సమయంలో డ్రైవర్లు విశ్రాంతి తీసుకుని, డ్యూటీ సమయంలో ఏకాగ్రతతో పనిచేయాలని, కుటుంబ సమస్యలు, ఇబ్బందులు, బాధ్యతలను పక్కన పెట్టి, బస్సులో ఉన్న సుమారు 40 నుంచి 60 కుటుంబాల భవిష్యత్, భద్రత మనపై ఉందన్న విషయం గుర్తించాలన్నారు. మెకానిక్‌లు బస్సులను కండిషన్‌లో ఉంచాలని, చిన్న విషయాలపై అశ్రద్ధ వహించకూడదన్నారు. డ్రైవర్లు, మెకానిక్‌లు, కండక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గజపతినగరం: గజపతినగరం ఉన్నత పాఠశాల 1984-89 బ్యాచ్ పూర్వవిద్యార్థులు

గజపతినగరం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1984-89 మధ్య చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆపాఠశాల వేదికగా ఆదివారం జరిగిం ది. మూడున్నర దశాబ్దాల తర్వాత కలుసుకోవడంతో ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని,యోగక్షేమాలు, కుటుంబ జీవితం గురించి తెలుసుకు న్నారు. అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.వారికి అప్పటిలో పాఠాలు బోధించిన హెచ్‌ఎం అల్లు అప్పలస్వామి, ఉపాధ్యా యులు మర్రాపు వేణు, కె.బి.ఆర్. ఆచార్యులు, మృత్యుంజయరావు, పద్మావతి, వరలక్ష్మి, దైవకృప, శిరోమణి, సన్యాశిరాజును సన్మానించారు. అనంతరం తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి తమవంతు సహకారం అందించాలని నిర్ణయించుకున్నారు.

వివేకానంద కళాశాలలో..

శృంగవరపుకోట: స్థానిక వివేకానంద కళాశాలలో 2009- 2014 మధ్య ఇంటర్ ,డిగ్రీ చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆ కళాశాల వేదికగా ఆదివా రం నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ సీహెచ్.ఆర్.కె.ప్రసాద్ జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆత్మీయ కలయిక కోసం ఎక్కడెక్కడో ఉన్న వారంతా వచ్చారు.ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని, ఆలింగనాలు చేసుకున్నారు. తమ కుటుంబ నేపథ్యాలు, చేస్తున్న వృత్తి, ఉద్యోగాల గురించి తెలుసుకున్నారు. కళాశాల రోజుల నాటి జ్ఞాపకాలను జ్ఞప్తికి తెచ్చుకున్నారు. తమకు విద్యాబోధన చేసిన గురువులను సన్మానించారు. ఫ్రప్రత్యేకంగా వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేశారు. రోజంతా ఉల్లాసంగా గడిపి విందు భోజనాలు చేశారు.



శృంగవరపుకోట: ఆత్మీయ కలయికలో వివేకానంద కళాశాల పూర్వవిద్యార్థులు

అమిత్‌షా.. గో బ్యాక్



శృంగవరపుకోట: ఉత్తరాపల్లిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు



శృంగవరపుకోట: ఎల్.కోటలో రాస్తారోకో చేస్తున్న సీపీఎం నాయకులు



శృంగవరపుకోట: ఎస్.కోటలో రాస్తారోకో చేస్తున్న సీపీఎం శ్రేణులు



గజపతినగరం:పురిటిపెంటలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నేతలు

శృంగవరపుకోట: పార్లమెంట్‌లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్‌ను అవమానించేలా మాట్లాడిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు రాష్ట్రంలో పర్యటించే హక్కు లేదని సీపీఎం నాయకులు అన్నారు.అమిత్‌షా విజయవాడ పర్యటనపై నిరసన తెలిపారు.అమిత్ షా గోబ్యాక్ అంటూ నినాదా లు చేస్తూ కొత్తవలస, లక్కవరపుకోట, శృంగవరపుకోట మండల కేంద్రాల్లో, ఉత్తరాపల్లి వద్ద గాంధీన గర్‌లో సీపీఎం, ఆపార్టీ అనుబంధ సంఘాల నేతలు, కార్యకర్తలు ఆదివారం రాస్తారోకో చేశా రు.అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్‌షాను కేంద్ర మంత్రివర్గం నుంచి బర్త్‌రఫ్ చేయాలని, విజయవాడ పర్యటనను అడ్డుకోవాలని నినాదాలు చేశారు. సీపీఎం నేతలు మద్దిల రమణ, చల్లా జగన్, గాడి అప్పారావు, చెలికాని ముత్యాలు, ఎం.పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా ప్రజలకు క్షమాపణ చెప్పాలి

గజపతినగరం: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్‌ను కించపరిచేలా మాట్లాడిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా దేశ ప్రజలందరికీ బహిరంగ క్షమాపణ చెప్పాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. అమిత్‌షా ఆంధ్రప్రదేశ్ పర్యటనను వ్యతిరేకిస్తూ పురిటిపెంటలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఎం నాయకులు ఆదివారం నిరసన తెలిపారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ అమిత్‌షాకు రాజ్యాంగం అంటే గౌరవం లేదని మండిపడ్డారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ అజెండాను అమలు చేయాలని చూస్తోందని, భిన్నత్వంలో ఏకత్వం,లౌకిక విధానం,ఫెడరల్ వ్యవస్థ, ప్రజల హక్కులకు భంగం కలిగించేలా పాలన చేస్తున్నారని విమర్శించారు. సీపీఎంనాయకులు రాకోటి రాములు,హరి కృష్ణవేణి, జెర్రి రాము, లక్ష్మి,శివ, సత్యనారాయణ పాల్గొన్నారు.

నేటి నుంచి లెప్రసీ సర్వే

దత్తిరాజేరు: మండలంలో సోమవారం నుంచి ఫిబ్రవరి 25వ తేదీ వరకువైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో లెప్రసీ సర్వే నిర్వ హించనున్నట్లు దత్తిరాజేరు, కె.కొత్తవలస పీహెచ్‌సీల వైద్యాధికారులు ఆనంద్‌కుమార్,రఘు ఆదివారం వేర్వే రు ప్రకటనల్లో తెలిపారు. వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఒంటిపైన స్పర్శ లేని మచ్చలు ఉన్న వారిని, తిమ్మిర్లు,నరాల బలహీనత ఉన్న వారిని గుర్తిస్తారని పేర్కొన్నారు. లెప్రసీ నిర్ధారణ అయితే ఉచితంగా మందులు అందజేయనున్నట్లు తెలిపారు.

బోరు బాగు చేయరూ..



కెల్ల ఉన్నత పాఠశాలలో పాడైన బోరు

గుర్ల: మండలంలోని కెల్ల గ్రామ ఉన్నత పాఠశాలలో హ్యాండ్ బోరు పాడైంది. దీంతో విద్యార్థులు మధ్యాహ్న భోజన సమయంలో చేతులు,ప్లేట్లు శుభ్రం చేసుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి బోరుకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని, బోరు చుట్టూ కొత్తగా ప్లాట్‌ఫామ్ నిర్మించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

జూదరుల అరెస్ట్

డెంకాడ: మండలంలోని ఆకులపేట గ్రామ శివారులో పేకాటాడుతున్న ఆరుగురిని పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ ఏ.సన్యాసినాయుడు, సిబ్బంది ఆదివారం దాడులు చేపట్టగా ఆరుగురు పట్టుబడ్డారు. వీరి వద్ద నుంచి 40,960 రూపాయల నగదు, ఎనిమిది సెల్‌ఫోన్లు, మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ తెలిపారు.

• వంతెన లేక అవస్థలు



బ్రిడ్జి నిర్మించాల్సిన ప్రాంతం ఇదే

చీపురుపల్లి: మండలానికి పాతిక కిలోమీటర్ల దూరంలో శ్రీకాకుళం జిల్లాలోని రణస్థలంకు అతి సమీపంలో ఉన్న అలకనారాయణపురం గ్రామస్తులను వంతెన కష్టాలు వెంటాడుతున్నాయి. గ్రామాన్ని ఆనుకుని ఉన్న తోటపల్లి కాలువపై బ్రిడ్జి నిర్మాణం జరగకపోవడతంతో గ్రామస్తులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కాలువకు అవతలి వైపు పంట పొలాలకు వెళ్లేందుకు రోజూ కొన్ని కిలోమీటర్ల దూరం నడవాల్సి వస్తోందని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బ్రిడ్జి కోసం ఎదురు చూపులు

అలకనారాయణపురం గ్రామాన్ని ఆనుకుని తోటపల్లి కాలువ రణస్థలం వరకు ఉంది. గ్రామాన్ని ఆనుకుని కాలువ ఉండడంతో గ్రామస్తులు పంట పొలాలకు రాకపోకలు సాగించేందుకు కాలువ పనులతో పాటు బ్రిడ్జి నిర్మాణం కూడా చేపట్టాల్సి ఉంది. గత ప్రభుత్వంలో ప్రారంభమై నిలిచి పోయిన బ్రిడ్జి నిర్మాణ పనులు తిరిగి ఇంతవరకు ప్రారంభం కాలేదు. దీంతో బ్రిడ్జి పనులు మళ్లీ ఎప్పుడు ప్రారంభమవుతాయా అని గ్రామస్తులు ఎదురు చూస్తున్నారు.

కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలపై నిరసన

శృంగవరపుకోట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలింభిస్తున్న కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలపై స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బాపూజీ విగ్రహం వద్ద సీపీఎం నేతలు ఆదివారం నిరసన తెలిపారు. కార్మిక, కర్షక దినోత్సవం సందర్భంగా వ్యవసాయ, కార్మిక సంఘాలు ఆయా రంగాల్లో ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణం పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వాల బుద్ధి మారాలని, రైతాంగానికి, కార్మికలో కానికి ఉపాధి కల్పించాలని కోరుతూ మహాత్మా గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ నేతలు గాడి అప్పారావు, మద్దిల రమణ, చల్లా జగన్, సీహెచ్.ముత్యాలు, తదితరులు పాల్గొన్నారు.



గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సీఐటీయూ నేతలు